సాక్షి అనకాపల్లి

బుధవారం । 3 । ఏప్రిల్ । 2024



అష్టదళ పద్మారాధన

విశాఖ: కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉష్ణోగ్రతలు గరిష్టంగా 37.2, కనిష్టంగా 35.6 డిగ్రీలు, తేమ 67 నుంచి 70 శాతం, గాలి గంటకు 8 కి.మీ. వేగంతో వీస్తుందన్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహర్ (గురు)
అనకాపల్లి	6.14	4.36
నర్సీపట్నం	6.17	4.33

న్యూస్‌రీల్

నేటి నుంచి పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

తుమ్మపాల: ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో అవ్వా తాతలకు పింఛన్లు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా వృద్ధులు, వికలాంగులను దృష్టిలో పెట్టుకుని ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండి పింఛన్ల పంపిణీ చేపట్టాలన్నారు. జిల్లాలో 2,66,199 మందికి రూ.7.75 కోట్లు పంపిణీ చేయనున్నామన్నారు. 3వ తేదీన బ్యాంకుల నుంచి నగదు విత్‌డ్రా చేసి సచివాలయ సిబ్బంది సహకారంతో పంపిణీ చేసేందుకు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, కార్యదర్శికి బాధ్యతలు అప్పగించామన్నారు. పింఛనుదారులకు సచివాలయాల వద్ద ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు ఆమె తెలిపారు. దివ్యాంగులు, అనారోగ్య బాధితులు, సైనిక్ వెల్ఫేర్ వితంతువులకు ఇంటి వద్దనే పింఛను అందించే సౌలభ్యం కల్పించామన్నారు.

టెన్త్ మూల్యాంకనం పరిశీలన



పదో తరగతి పరీక్షల మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న సంచాలకుడు విజయభాస్కర్

తుమ్మపాల : పదవ తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకనం సక్రమంగా చేయాలని జోన్-1 ప్రాంతీయ విద్యా సంచాలకులు విజయభాస్కర్ ఉపాధ్యాయులకు సూచించారు. పట్టణంలో గవరపాలెం బాయ్స్ హైస్కూల్, బాలికోన్నత పాఠశాల, ఏఎంఏఎల్ హైస్కూల్లో జరుగుతున్న మూల్యాంకనం కార్యక్రమాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఉపాధ్యాయులు మూల్యాంకనం చేస్తున్న సమాధాన పత్రాలను ప్రిన్సిపల్స్ ఆఫ్ వాల్యువేషన్ ప్రాప్తికి దిద్దుట, అన్ని అంశాలు, మార్కుల వేసే విధానాలను క్షుణ్ణంగా గమనించారు. అదేవిధంగా పరీక్షా కేంద్రాల్లో ఉపాధ్యాయులకు చేకూర్చిన ఏర్పాట్లపైనా అధికారులతో సమీక్షించారు. మూల్యాంకనం నిర్వహిస్తున్న గదుల్లో విద్యుత్, ఫ్యాన్లు సౌకర్యాలను పరిశీలించారు. ఆయనతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ, ఏడీ రవిబాబు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి, అమ్మకాల్లో ప్రగతి



ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ 2023-24లో ఉత్పత్తి, అమ్మకాల్లో ప్రగతి కనబరిచింది. గత ఆర్థిక సంవత్సరంలో వైర్ రాడ్ కాయిల్స్ 7.30 లక్షల టన్నులు, స్ట్రక్చరల్స్ 5.08 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి అంతకు ముందు ఏడాది కంటే వరసగా 43 శాతం, 11 శాతం వృద్ధి నమోదు చేసింది. గత ఏడాది 47 లక్షల టన్నుల హాట్ మెటల్, 46 లక్షల టన్నుల లిక్విడ్ స్టీల్ ఉత్పత్తి చేసి రెండింటిలో 7 శాతం వృద్ధి సాధించింది. విలువ ఆధారిత ఉత్పత్తులు 13.24 లక్షల టన్నులు అమ్మకాలు చేసి అంతకు ముందు ఏడాది కంటే 37 శాతం వృద్ధి నమోదు చేసింది. సేలబుల్ స్టీల్ 43.12 లక్షల టన్నులు విక్రయాలు చేసి 15 శాతం వృద్ధి సాధించింది. ముడి పదార్థాలు అందుబాటులో లేకపోవడం, మార్కెట్ మందగమనం ఉన్నప్పటికీ గత ఏడాది రూ. 23,129 కోట్ల విక్రయాల టర్నోవర్‌తో 2 శాతం వృద్ధి నమోదయింది. వినియోగదారుల సంతృప్తిని మెరుగు పరచడానికి డోర్ డెలివరీ ప్రాతిపదికన 90 వేల టన్నుల ఉత్పత్తులను సరఫరా చేసింది. ఈ సందర్భంగా సీఎండీ అతుల్ భట్ సిబ్బంది, అధికారులు అభినందించారు.

నమ్ముకుంటే నట్టేట ముంచారు

సీటు ఎలా ఇస్తాం.. రూ.50 కోట్లు చూపించాలని చెప్పాను కదా... అదేంటి సార్.. పార్టీ కష్టకాలంలో ఉంటే.. మా ఆస్తులన్నీ అమ్మి కేడర్‌ను కాపాడుకుంటూ వచ్చాం కదా.. ఈ సమయంలో ఇలా మాట్లాడితే ఎలా చెప్పండి. ఇదిగో రూ.20 కోట్లు మాత్రమే ఉన్నాయి. మీరు కొంచెం సహకరిస్తే.. ఏయ్.. మాటల్లేవ్.. మాట్లాడుకోడాల్లేవ్.. ఓటుకు నోటు ఎలాగో.. సీటుకు కోట్లు అలాగే.. ఇది ఫిక్స్. అసలే పొత్తు లెక్కలతో ప్రతి సీటుకి డిమాండ్ బాగా పెరిగిపోయింది. మీలాంటి వాళ్లకు సీటివ్వలేను. తమాషాలు చేయకుండా.. పార్టీకి పనిచేయండి..

ఇవీ.. సీనియర్ నేతలు, పార్టీని భుజస్కందాలపై మోసిన నాయకులతో చంద్రబాబు నిస్సిగ్గు వ్యాఖ్యలు.



- నోట్ల కట్టలున్న వారికే టికెట్లు కట్టబెట్టారని టీడీపీ నేతల ఆగ్రహం
- పార్టీని నమ్ముకొని పనిచేస్తే బాబు ద్రోహం చేశారని ఆవేదన
- కండువాపై కండువా వేసి పనిచేయలేమంటున్న క్యాడర్
- ప్రతి నియోజకవర్గంలో రగులుతున్న అసంతృప్తి
- కొత్తగా వచ్చిన వారికి టికెట్లు ఇవ్వడంపై పవన్‌పై క్యాడర్‌లో వ్యతిరేకత
- రెండు కత్తులు ఒకే ఒరలో ఇమిడే ప్రసక్తే లేదంటున్న జనసేన వర్గం

సాక్షి, విశాఖపట్నం : నోట్ల కట్టలు చూపించినవారికే టికెట్ కన్ఫార్మ్ చేసిన చంద్రబాబు వైఖరిపై ఆ పార్టీ నేతలు మండిపడుతున్నారు. పార్టీని నమ్ముకుంటూ పనిచేస్తుంటే నోట్ల కట్టలకు సీట్లు అమ్ముకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తోకపార్టీ జనసేనలోనూ ఇదే వైఖరి కనిపిస్తోంది. పదేళ్లు కష్టపడిన వారిని పక్కన పెట్టేసి.. కొత్తగా కండువా కప్పుకున్న వారికి టికెట్ కట్టబెట్టిన పవన్ వ్యవహారంపైనా కేడర్‌లో వ్యతిరేకత మొదలైంది. ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టేసుకొని కండువాపై కండువా వేసుకుంటూ ప్రచారం చేయడం తమ వల్ల కాదంటూ టీడీపీ, జనసేన నాయకులు కుండబద్దలు కొట్టేస్తున్నారు. ఉమ్మడి విశాఖలో ప్రతి నియోజకవర్గంలోనూ ఈ అసమ్మతి కుంపటి రోజురోజుకూ రాజుకుంటోంది. ప్రతి నియోజకవర్గంలోనూ కేడర్ మొత్తం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ తీరు తూర్పారపడుతున్నారు.

గంటాకు సీటు అమ్మేశారు

భీమిలి నియోజకవర్గంలో ఆది నుంచి కేడర్‌ను కాపాడుకుంటూ వస్తున్న కోరాడ రాజబాబు, కర్రోతు బంగార్రాజును గతంలో మెచ్చుకున్న చంద్రబాబు.. ఇప్పుడు వారి దగ్గర డబ్బులు లేవంటూ గంటా వైపు మొగ్గు చూపారు. సుమారు రూ.20 కోట్ల వరకూ ఖర్చు చేయగలనని చంద్రబాబుకు చెప్పి.. టికెట్ ఇవ్వాలని కోరాడ కోరినా.. సరిపోవంటూ బాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఈ వర్గాలు బాబు వైఖరిపై మండిపడుతున్నాయి. భీమిలిని నాశనం చేసిన గంటాకు టికెట్ అమ్మేసుకున్నారంటూ టీడీపీ శ్రేణులే బహిరంగంగా ఆరోపణలు చేస్తున్నాయి.

జనసేనతో కోట్లకు బేరం

దక్షిణ నియోజకవర్గంలో టీడీపీ తరపున టికెట్ ఆశిస్తూ క్షేత్ర స్థాయిలో కార్యకర్తలతో మమేకమైన పార్టీ నేతలు డా.విల్లూరి చక్రవర్తి, నజీర్‌కి కూడా చంద్రబాబు మొండిచెయ్యి చూపించారు. పార్టీని నమ్ముకుంటూ వచ్చిన తమను మోసం చేయడం తగదని వేడుకున్నా.. వారి మాటలు వినేందుకు కూడా చంద్రబాబు, లోకేష్ ఇష్టపడలేదని సమాచారం. దీంతో దక్షిణ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయిస్తూ టీడీపీ అధినేత చంద్రబాబు బేరం కుదుర్చుకున్నాడని విమర్శలు కోడై కూస్తున్నాయి.

ద్వితీయశ్రేణి నేతలపై నిర్లక్ష్యం

ఉత్తర నియోజకవర్గం గంటా శ్రీనివాసరావు గెలిచిన నాటినుంచి నియోజకవర్గం ముఖం చాటేసిన తర్వాత.. అక్కడి కార్పొరేటర్లు, ద్వితీయశ్రేణి నేతలు పార్టీకి కాపుకాస్తూ వచ్చారు. అయితే ఇక్కడ టికెట్‌ను బీజేపీకి కేటాయించడంతో పార్టీలో ఎదగనీయకుండా అడ్డుకుంటున్నారంటూ టీడీపీ నేతలు మండిపడుతున్నారు.

నమ్ముకున్నోళ్లకు ఝలక్

అనకాపల్లి నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఆది నుంచి పార్టీలో ఉన్న పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్దా నాగజగదీష్ టికెట్ ఆశించారు. వీరితో పాటు పూటకో పార్టీ మారే దాడి వీరభద్రరావు కూడా టికెట్ ఆశించి.. టీడీపీలోకి జంప్ అయ్యారు. వీరందరికీ చెక్ చెప్పి.. జనసేనకు టికెట్ కేటాయించడంపై అందరిలోనూ ఒక్కసారిగా ఆగ్రహం కట్టలు తెంచుకుంది. డబ్బులు మూటలకే టికెట్లు కేటాయించారంటూ చంద్రబాబుపై టీడీపీ కేడర్ విమర్శిస్తోంది.

'గ్లాసు'లోనూ అసమ్మతి తుపాను

ఇక పార్టీ పెట్టినప్పటి నుంచి చంద్రబాబుతోనే ప్రత్యక్షంగా, పరోక్షంగా పయనిస్తూ.. చెట్టపట్టాలేసుకొని తిరుగుతున్న జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు కూడా.. బాబు లక్షణాలు వంటబట్టాయి. తనని నమ్ముకొని పార్టీలోకి వచ్చిన వారి భవిష్యత్తును గాలిలో దీపం మాదిరిగా వదిలేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా జనసేన శ్రేణులు పవన్ పొత్తు వైఖరిని దుమ్మెత్తి పోస్తున్నారు. టికెట్ ఆశించి పార్టీకి ఏ తాడు బొంగరం లేకపోయినా అన్నీ తామై కోట్లు ఖర్చు చేసిన వారిని ఏమాత్రం పట్టించుకోలేదు. నియోజకవర్గంలో జనసేన కోసం పాటుపడిన వారికి, టికెట్ ఆశించి పార్టీలో చేరిన వారికీ పవన్ ఝలక్ ఇచ్చారు. భీమిలిలో పంచకర్ల సందీప్‌కు టికెట్ ఇస్తానని చెప్పి చివరి నిమిషంలో మోసం చేయడంపై భీమిలి జనసేన వర్గం పవన్ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. దక్షిణంలో టికెట్ ఇస్తామన్న హామీతో గ్లాసు పట్టుకున్న కార్పొరేటర్లు కందుల నాగరాజు, సాధిక్.. పవన్‌ను నమ్ముకొని రోడ్డున పడ్డారు. ఉత్తర నియోజకవర్గంలో పసుపులేటి ఉషాకిరణ్‌కీ పవన్ వెన్నుపోటు పొడిచారు. గాజువాక టికెట్ ఆశించి పార్టీ కోసం రూ.కోట్లు ఖర్చు చేసిన సుందరపు సతీష్‌ని కరివేపాకులా తీసిపారేశారు. అనకాపల్లిలో పరుచూరి భాస్కరరావు పవన్ హ్యాండిచ్చారు. పాయకరావుపేటలో టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనితకు సీటు ఇవ్వొద్దని జనసేన నేత గెడ్డం బుజ్జి అభ్యర్థన కూడా పవన్ కల్యాణ్ పరిగణలోకి తీసుకోలేదు. ఇలా కూటమి పేరుతో టికెట్లు అమ్ముకున్నారంటూ జనసేన శ్రేణులు కూడా దుమ్మెత్తి పోస్తున్నాయి.

బండారుకు జెల్ల

పెందుర్తిలో సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తికి చంద్రబాబు జెల్ల కొట్టారు. చివరి వరకూ పార్టీ టికెట్ నీదేనంటూ హామీ ఇచ్చిన బాబు.. చివరి నిమిషంలో జనసేనకు కట్టబెట్టడంతో టీడీపీ కేడర్ అసంతృప్తితో రగిలిపోతోంది. బండారుకు బద్ధశత్రువైన పంచకర్ల రమేష్ బాబు వెంట పయనించే ప్రసక్తే లేదని, చంద్రబాబుకు ఇష్టం ఉంటే ఆయనే వచ్చి ప్రచారం చేసుకోవాలే తప్ప.. తాము సహకరించబోమని తెగేసి చెబుతున్నారు.

రూ.50 కోట్లకు సీటు అమ్ముకున్నాడని ప్రచారం

మాడుగుల సీటును మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీజీ కుమార్ సీటు ఆశించారు. వీరిని కాదని ఎన్ఆర్ఐ పైలా ప్రసాదరావుకు టికెట్ కేటాయించారు. రూ.50 కోట్లకు చంద్రబాబు టికెట్‌ను అమ్ముకున్నారన్న ఆరోపణలు టీడీపీ శ్రేణుల నుంచే వినిపిస్తున్నాయి.

డబ్బులు లేవని పక్కన పెట్టేశాడు

యలమంచిలి టికెట్‌ను జనసేనకు అమ్ముకున్నారంటూ టీడీపీ నేతలు మండిపడుతున్నారు. టికెట్ ఆశించిన ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు వద్ద డబ్బులు లేవన్న సాకుతో టికెట్ లేదని చెప్పడంతో.. వారిని నమ్ముకున్న కేడర్ రగిలిపోతోంది. సోమవారం జరిగిన ఆత్మీయ సమావేశంలోనూ పార్టీ శ్రేణుల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. జనసేనకు చంద్రబాబు ఇక్కడ టికెట్‌ను అమ్ముకున్నాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మన్యంలో మాయాజాలం

పాడేరులో టికెట్ కోసం పోటీపడిన గిడ్డి ఈశ్వరి, మణికుమారిని కాదని.. డబ్బులు దండిగా ఉన్నాయన్న లెక్కలతో కిల్లు రమేష్‌నాయుడుకు చంద్రబాబు టికెట్ కేటాయించారు. దీంతో మిగిలిన రెండు వర్గాలూ.. ఇది మూమ్మాటికీ నోటుకు సీటు అంటూ చెబుతున్నారు. టికెట్ కోసం పోరాటం చేస్తాం తప్ప.. కూటమి వెంట నడిచే సమస్యే లేదంటున్నారు. టికెట్లు అమ్ముకుంటే పార్టీ కోసం పనిచేసేవారి పరిస్థితి ఏంటో చంద్రబాబు చెప్పాలని ప్రశ్నిస్తున్నారు.

అరకులో అదే తీరు

అరకులో పర్యటించిన సమయంలో దొన్నుదొర అభ్యర్థి అంటూ చంద్రబాబు స్వయంగా ప్రకటించారు. అయితే పార్టీ టికెట్ ఆశించిన కిడారి శ్రవణ్, అబ్రహంను కూడా పక్కకు నెట్టేశారు. అరకులో అంతగా ప్రభావంలేని బీజేపీకి చెందిన పాంగి రాజారావుకి టికెట్ ఇవ్వడం వెనుక రూ.కోట్లు చేతులు మారాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే అబ్రహం రెబల్‌గా పోటీ చేస్తానని ప్రకటించగా.. దొన్నుదొర, శ్రావణ్ వర్గాలు మాత్రం చంద్రబాబు వైఖరిని తప్పుపడితూ.. కూటమికి సహకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశాయి.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు



కశింకోటలో పంచాయతీ కార్యదర్శి రమేష్‌కు రాజీనామా పత్రాలను అందజేస్తున్న గ్రామ వలంటీర్లు



ఎమ్మెల్యే అభ్యర్థి జోగులు సమక్షంలో రాజీనామా పత్రాలతో వలంటీర్లు



ఉగ్గినపాలెంలో రాజీనామా చేసిన పత్రాలతో గ్రామ వలంటీర్లు

- ప్రతిపక్షాల వికృత విమర్శలతో మనస్తాపం
- కశింకోట, కోటవురట్ల మండలాల్లో విధుల నుంచి తప్పుకున్న వలంటీర్లు

కశింకోట: మండల కేంద్రంలో 89 మంది గ్రామ వలంటీర్లు మంగళవారం రాత్రి మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి రమేష్‌కు రాజీనామా పత్రాలను అందజేశారు. అలాగే ఉగ్గినపాలెంలో ఆరుగురు గ్రామ వలంటీర్లు, బయ్యవరం సచివాలయానికి చెందిన 18 మంది గ్రామ వలంటీర్లు పంచాయతీ కార్యదర్శులకు రాజీనామా సమర్పించారు. ప్రజలకు అందిస్తున్న సేవలను నిర్వహించనీయకుండా కొంతమంది నాయకులు అడ్డగోలుగా తమపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి, తమను విధులకు దూరం చేశారని, ఇందుకు మనస్తాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు వలంటీర్లు ఈ సందర్భంగా ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాల్సిందని విస్తృత ప్రచారం చేస్తామన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వ పథకాలను చేరవేసి ప్రజలకు సేవలందించడానికి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్నను మళ్లీ సీఎంగా చూడడమే మా ధ్యేయం

కోటవురట్ల: ముఖ్యమంత్రి జగనన్న ఆశయాలకు తోడుగా ఇన్నాళ్లూ సేవ చేశాం.. సేవ చేయడంలో ఉన్న సంతృప్తిని ఇప్పటి వరకు అనుభవించాం.. ప్రతిపక్ష నేత చంద్రబాబు కుతంత్రాలతో సేవకు మమ్మల్ని దూరం చేశారు.. జగనన్నను గెలిపించుకునే బాధ్యత అందరితోపాటు మాపై ఉంది.. అందుకే రాజీనామా చేస్తున్నామంటూ వలంటీర్లు ముక్తకంఠంతో చెప్పారు. కె.వెంకటాపురంలో 23 మంది వలంటీర్లు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ ఆధ్వర్యంలో పాయకరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు సమక్షంలో మంగళవారం రాజీనామా పత్రాలతో తమ నిర్ణయాన్ని తెలిపారు. ఇక తామంతా పూర్తి స్వతంత్రులుగా జగనన్నకు తోడుగా ఎన్నికలలో వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేస్తామన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన కలెక్టర్



వడ్డాదిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



తాటిపర్తి వద్ద చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

బుచ్చెయ్యపేట : కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ బుచ్చెయ్యపేట మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మంగళవారం రాజాం, బుచ్చెయ్యపేట, దిబ్బిడి, వడ్డాది గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను వారు ఆర్డీవో చిన్నికృష్ణతో కలిసి పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద వసతులను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మంచినీటి సదుపాయం, విద్యుత్, బాత్‌రూం సదుపాయంతో పాటు దివ్యాంగులు, వృద్ధులు పోలింగ్ కేంద్రాల్లో వెళ్లడానికి అనువుగా రోలింగ్‌లు ఉన్నదీ లేనిదీ పరిశీలించారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా అధికారులు సమష్టిగా పనిచేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ కేంద్రాలపై తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్ఐ ఈశ్వరరావు, ఎంపీడీవో వెంకటాచార్యలను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

తాటిపర్తి చెక్‌పోస్టు తనిఖీ

మాడుగుల రూరల్ : జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి మంగళవారం సాయంత్రం తాటిపర్తి చెక్‌పోస్టును జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కె.వి. మురళీకృష్ణతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 24 గంటల పాటు స్పెషల్ స్ట్రయికింగ్ టీమ్ పనిచేస్తుందన్నారు. నగదు, మద్యం, గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయడానికి ఈ చెక్‌పోస్టు దోహదపడుతుందని, ఇక్కడ పోలీసు, రెవెన్యూ సిబ్బంది కలిసి ప్రతి వాహనాన్ని చెక్ చేస్తారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. వీరి వెంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వి.సత్యవాణి, తహసీల్దారు టి.సత్యనారాయణ, ఎ.కోడూరు సీఐ స్వామి నాయుడు, ఎస్ఐ పి.దామోదర్‌నాయుడు, ఇతర పోలీసు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పింఛనుదారుల్లో దిగులు

- రెండో తేదీ వచ్చినా నగదు అందకపోవడంతో ఆందోళన
- గ్రామసచివాలయాలకు వెళ్లి తీసుకోవడం కష్టమని ఆవేదన
- చంద్రబాబు కుట్ర రాజకీయాలపై ఆగ్రహం

కోటవురట్ల, బుచ్చెయ్యపేట: ప్రతి నెలా ఒకటో తేదీన పింఛను ఠంఛన్‌గా పొందే అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువుల్లో ఆందోళన నెలకొంది. వీరి ఇళ్లకు వెళ్లి పింఛను అందజేసే వలంటీర్లను సేవల నుంచి తప్పించేందుకు కుట్ర పన్నిన చంద్రబాబు తీరుపై వారు మండిపడుతున్నారు. ఇదెక్కడి కుట్ర రాజకీయా లని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ వచ్చేసరికి ఇంటికి తీసుకువచ్చి పింఛను ఇచ్చేవారని చంద్రబాబు కారణంగా ఈనెల రెండో తేదీ వచ్చినా అందలేదని వారు ధ్వజమెత్తుతున్నారు. గ్రామసచివాలయాలకు వెళ్లి తీసుకోవడం కష్టమని వారు వాపోతున్నారు. నెల వారీ ఖర్చులలో భాగంగా మందులు, నిత్యావసర సరకులు కొనుక్కునేందుకు వీలు లేకుండా పోయిందని దిగులు చెందుతున్నారు. ఇంటి వద్దే పింఛను అందేలా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

మేమేం పాపం సేశాం..



పెతీ నెల ఒకటో తేదీనే వలంటీరు ఇంటికి తెచ్చి పింఛనీ ఇత్తన్నాడు. రెండు రోజులైనా ఇంకా రానేదేంటా అని పింఛనీ పుత్తకం పట్టుకుని చూత్తన్నాను. ఎవరో సెప్పేరు.. పింఛనీ కోసం పంచాయతీ ఆపీసు కెళ్లాలంట. వలంటీరు పింఛను ఇవ్వకూడదని సెంద్రబాబు ఆపేసాడంట. ఆ బాబు పదవిలోకి రాకుండానే మాలాంటోళ్లను ఇబ్బంది పెడితే గెలిపిత్తే ఎన్ని కట్టాలు పెడతాడో! మేమేం పాపం సేశాం. కాటికి కాళ్లు చాచిన వయసులో జగన్‌బాబు పెద్ద కొడుకులా మా ఇంటికే వలంటీర్లను పంపి పింఛను ఇత్తన్నాడు. మళ్లీ ఎండలో కాళ్లీడ్చుకుంటూ ఆపీసుల చుట్టు తిరగాలంటే ఎలా. సెంద్రబాబు ఇలా సేత్తాడనుకోలేదు. మళ్లీ మా జగన్ బాబు రావాలి.

–సిలపరశెట్టి అచ్చియ్యమ్మ, వృద్ధురాలు, రాజుపేట, కోటవురట్ల మండలం

మంచానికే పరిమితం.. నేను ఎలా వెళ్లగలను?



కళాసీగా పనిచేస్తూ ఐదేళ్ల క్రితం సిమెంట్ బస్తాలు లోడు దింపుతుండగా ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయాను. నా కాళ్లు, వెన్నుపూస దెబ్బతిని మంచాన పడ్డాను. ఐదేళ్లుగా లేచి నడవలేక మంచంపైనే ఉన్న నాకు వలంటీరు ఇంటికొచ్చి ప్రతి నెలా పింఛన్ అందిస్తున్నారు. ఇప్పుడు వలంటీర్లను తీసేసి సచివాలయం వద్దకు వెళ్లి పింఛన్ తీసుకోమంటే నేను ఎలా వెళ్లగలను. మంచంపై మోసుకెళ్లి ఎండలో సచివాలయ కార్యాలయం వద్ద లైన్‌లో ఉండి పింఛన్ తీసుకోమంటే నా ఉండె ఆగిపోయేలా ఉంది. పింఛన్ మీదే ఆధారపడ్డాను. అధికారులే న్యాయం చేయాలి.

–తమరాన సత్తిబాబు, దివ్యాంగుడు, వడ్డాది, బుచ్చెయ్యపేట మండలం

టీడీపీ నాయకుల గూండాగిరి

- అయ్యరక కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ ఇంటిపై దాడి
- అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదం
- హద్దు దాటితే పరిస్థితి తీవ్రంగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ శ్రేణుల హెచ్చరిక



పోలీసులతో టీడీపీ శ్రేణుల వాగ్వాదం

నర్సీపట్నం: పట్టణంలోని వెంకునాయుడుపేటలో గల అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి కనకమహాలక్ష్మి, రామ్‌గోపాల్ దంపతుల ఇంటిపై మంగళవారం రాత్రి టీడీపీ నేతలు దాడి చేశారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, తనయుడు విజయ్ అండతో డైరెక్టర్ ఇంటి వద్ద టీడీపీ నాయకులు గూండాగిరీ చేశారు. దీంతో డైరెక్టర్ ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అప్పటికి కొద్దిసేపటి ముందే ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కనకమహాలక్ష్మి ఇంటికి వెళ్లి పార్టీ ముఖ్య నాయకులకు ఎన్నికల ప్రచారంపై దిశానిర్దేశం చేశారు. ఆ సమయంలో కొంతమంది వలంటీర్లు ఎమ్మెల్యే వద్దకు వచ్చి టీడీపీ నాయకుల వేధింపులు భరించలేకపోతున్నామని, తమ పదవులకు రాజీనామా చేస్తామని ఎమ్మెల్యేకు చెప్పారు. అనంతరం ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. ఎమ్మెల్యే అక్కడ నుంచి వెళ్లిన తర్వాత టీడీపీ కార్యకర్తలు డైరెక్టర్ ఇంటిని ముట్టడించారు. గేట్లను తన్నుకుంటూ రౌడీల్లా ప్రవర్తించి చుట్టుపక్కల వారిని భయభ్రాంతులకు గురి చేశారు. విషయం తెలుసుకున్న టౌన్ సీఐ కాంతి కుమార్ సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు అశాంతి వాతావరణం సృష్టించే ప్రయత్నం చేశారు. పోలీసులు అడ్డుకోవడంతో వారితో వాగ్వాదానికి దిగారు. ఏమైనా ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయాలి తప్ప ఈ విధంగా ఇంటిపైకి వచ్చి ఆందోళన చేయటం సరికాదని పోలీసులు హెచ్చరించారు. వారు ఎంత చెప్పినప్పటికీ టీడీపీ కార్యకర్తలు మొండివైఖరితో వ్యవహరించడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు అక్కడకు చేరుకుని వారిపై మండిపడ్డారు. దాడి చేసిన టీడీపీ నాయకులపై పోలీసులు చర్యలు తీసుకుని, స్టేట్ డైరెక్టర్‌కు రక్షణ కల్పించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్లు కొనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడుతోపాటు మరికొంత మంది కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. టీడీపీ నాయకుల్లా తాము సైతం దురుసుగా వ్యవహరిస్తే పరిస్థితి వేరేలా ఉంటుందని వారు హెచ్చరించారు. ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి కనకమహాలక్ష్మి, ఆమె భర్త రామ్‌గోపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

పేమెంట్ బ్యాచ్ హంగామా

- సి.ఎం.రమేష్ పరిచయ సభకు ముఖం చాటేసిన టీడీపీ, జనసేన ముఖ్య నేతలు
- కిరాయి మనుషులతో మమ అనిపించిన వైనం

నక్కపల్లి/పాయకరావుపేట: కూటమి తరఫున అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి సి.ఎం.రమేష్ పరిచయ కార్యక్రమానికి టీడీపీ, జనసేన పార్టీల ముఖ్య నాయకులు ముఖం చాటేశారు. మంగళవారం పాయకరావుపేటలో జరిగిన సమావేశానికి సమీప గ్రామాల నుంచి రూ.200 చొప్పున చెల్లించి మహిళలను తీసుకువచ్చి మమ అనిపించారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి పార్లమెంట్ అభ్యర్థి రమేష్ పరిచయ కార్యక్రమాన్ని పట్టణంలో బైపాస్ జంక్షన్‌లో ఉన్న జగతా అప్పారావు కల్యాణ మండపంలో ఏర్పాటు చేశారు. టీడీపీ పాయకరావుపేట అభ్యర్థి వంగలపూడి అనితను ఆది నుంచి వ్యతిరేకిస్తున్న జనసేన నాయకుడు గెడ్డం బుజ్జికి ప్రాధాన్యం లభించడంతో టీడీపీ వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఈ పరిచయ కార్యక్రమానికి జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ వర్గం డుమ్మాకొట్టింది.

నర్సీపట్నంలో షాక్ ఇచ్చిన జనసేన

నర్సీపట్నం: సి.ఎం.రమేష్ మంగళవారం నర్సీపట్నంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి జనసేన నాయకులు హాజరు కాలేదు. మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో ఏర్పాటైన ఆత్మీయ సమావేశానికి జనసేన నాయకులు దూరంగా ఉన్నారు. సభ ప్రారంభం కాగానే జనసేన నియోజకవర్గ కన్వీనర్ రాజాన సూర్యచంద్రను స్టేజ్ పైకి ఆహ్వానించారు. సమావేశానికి సూర్యచంద్రతోపాటు పార్టీ క్యాడర్ రాకపోవడంతో సీఎం రమేష్ అవాక్కయ్యారు.

వెల్లువలా.. వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

- బుచ్చెంపేటలో టీడీపీ నుంచి 25 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక
- అయ్యన్న, విజయ్ బెదిరింపులతో ప్రజల నుంచి పెరుగుతున్న మద్దతు
- ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్
- తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన ఎమ్మెల్యే గణేష్


బుచ్చెంపేటలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే గణేష్


సారిపల్లిలో పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగులు

నాతవరం: రాజకీయాలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులు గ్రామాల్లో తమ ఎన్నికల ప్రచారానికి బ్రహ్మరథం పడుతున్నారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మండలంలోని లింగంపేట పంచాయతీ శివారు బుచ్చెంపేట గ్రామంలో 25 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి మంగళవారం చేరాయి. ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ గ్రామస్తులు ఆరాధించే పోతురాజుబాబును దర్శించుకుని, టీడీపీ నుంచి తమ పార్టీలోకి వచ్చిన వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం చేసిన మంచిని చూసే నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ప్రతిరోజూ టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లోకి ప్రచారానికి వెళ్తున్న అయ్యన్నపాత్రుడు, ఆయన తనయుడు విజయ్‌లు వారి పార్టీ నాయకుల్ని బెదిరించడం, సీఎం జగన్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని ఆక్షేపించారు. వారు తిట్టే కొద్దీ ప్రజల నుంచి తమకు మరింత ఆదరణ పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీ పైల సునీల్, పార్టీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, లింగంపేట సర్పంచ్ లోకారపు రాము, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అడిగర్ల నాయుడు, సర్పంచ్‌లు ఎం.బాబ్జి, గుడపర్తి అచ్చియ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెట్టుపల్లి గ్రామం నుంచి..

చెట్టుపల్లి గ్రామానికి చెందిన పది టీడీపీ కుటుంబాలు ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల్లో చిత్తశుద్ధితో పనిచేసి, పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.

సారిపల్లి నుంచి 20 టీడీపీ కుటుంబాల చేరిక

నక్కపల్లి: మండలంలోని సారిపల్లి పాలెం గ్రామం నుంచి తెలుగుదేశం పార్టీకి చెందిన సుమారు 20 కుటుంబాలు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తిల ఆధ్వర్యంలో వీరు పార్టీలో చేరారు. అడ్డురోడ్డులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఆరోవార్డు సభ్యుడు మామిడి గోవిందు, శ్రీనివాస్, కురందాసు గోవిందు, శ్రీనివాస్, శీరం నరేష్, కిల్లాడి మణికంఠ, పల్లా గణేష్, దుర్గాప్రసాద్, నరేష్, యలమంచిలి జోగారావు, హేమంత్‌తోపాటు సుమారు 100 మంది పార్టీలో చేరారు. వీరందరికి కంబాల జోగులు, బొడ్డేడ ప్రసాద్‌లు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గత ఐదేళ్ల నుంచి జగనన్న ప్రభుత్వం పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వాటితో తాము కూడా లబ్ధి పొందినట్లు పార్టీలో చేరిన వారు తెలిపారు. ఈ సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా, అభివృద్ధి కొనసాగాలన్నా వచ్చే ఎన్నికల్లో జగనన్న ముఖ్యమంత్రి కావాలన్నారు. పార్టీలో చేరి, పార్టీ విజయానికి కృషి చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని కంబాల జోగులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు యలమంచిలి తాతబాబు, ఎంపీటీసీలు లొడగల చంద్రరావు, బచ్చల రాజు, జేసీఎస్ జిల్లా కన్వీనర్ సూరాకాసుల గోవిందు పాల్గొన్నారు.

నరేంద్రపురం, మోటూరుపాలెంల నుంచి..

అచ్యుతాపురం: మండలంలోని కొండకర్లలో ఉన్న ఎమ్మెల్యే కన్నబాబురాజు గెస్ట్ హౌస్ వద్ద పలు గ్రామాలకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. దీంతో మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం సందడిగా మారింది. నరేంద్రపురానికి చెందిన ఐదు కుటుంబాలు సుంకర బుజ్జి, సుంకర రాజు, సుంకర అప్పారావు, సుంకర కిరణ్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ఎస్‌ఈజెడ్ కాలనీ మోటూరుపాలేనికి చెందిన యాభై కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరి, పార్టీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, పిన్నమరాజు వాసు, దేశంశెట్టి శంకర్‌రావు, కోన బుజ్జి, దిగుమర్తి శాంతికుమారి, లాలం శ్రీను, మోటూరు శ్రీకాంత్, నీరుకొండ అశోక్ కుమార్‌తో పాటు ఆయా గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.


మోటూరుపాలెం: కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కుటుంబాలు


వైఎస్సార్ సీపీలో చేరిన నరేంద్రపురం వాసులతో రమణమూర్తిరాజు, సుకుమారవర్మ

దోపిడీకి కేరాఫ్ అడ్రస్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: దోపిడీకి కేరాఫ్ అడ్రస్ టీడీపీ నాయకుడు అయ్యన్నపాత్రుడని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అయ్యన్నపాత్రుడు తనపై చేసిన విమర్శలను మంగళవారం నాటి ఎన్నికల ప్రచారంలో మీడియా ముఖంగా తిప్పికొట్టారు. దోపిడీలు, దౌర్జన్యాలు చేయటంతో పాటు ప్యాకేజీలు తీసుకోవటం అయ్యన్నపాత్రుడికి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. అలాంటి వ్యక్తి తనపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆరుసార్లు మంత్రిగా ఉండి రూ.వందల కోట్లు దోచుకున్నది నిజం కాదా? అని అయ్యన్నను ప్రశ్నించారు. ప్యాకేజీల అయ్యన్న పెద్దకొడుకైన మరుగుజ్జోడికి దోపిడీలు, లంచాలు, డబుల్ ఎక్సెల్ సైజ్ బనియన్లని ఎద్దేవా చేశారు. రంగురాళ్ల వ్యాపారులను బెదిరించి రూ.100 కోట్లు దోచుకున్న విషయం నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసన్నారు. పైసా అవినీతి లేకుండా నేరుగా ప్రజలకు లబ్ధి చేకూర్చుతున్న తమపై ఇలాంటి వారా విమర్శించేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న అయ్యన్నపాత్రుడు లేటరైట్ పేరుతో రూ.వందల కోట్ల సంపద లూటీ చేశారని ఆరోపించారు. పవర్ స్టేషన్‌లో తన మనిషికి ఉద్యోగం ఇవ్వలేదని డీఈని ఇంటికి పిలిచి కొట్టడమే కాకుండా, ఆ అధికారి కారుని ధ్వంసం చేసిన సంగతి ఎవరూ మర్చిపోలేదన్నారు. గొలుగొండ మండలం పెసరాడలో వందల ఎకరాలు బినామీ పేర్లతో అయ్యన్నపాత్రుడు దోచుకున్నారని దుయ్యబట్టారు. దోచుకున్న డబ్బుతో విశాఖపట్నంలో రెండు వందల ఎకరాల్లో రిసార్ట్స్ కట్టుకుని వ్యాపారం చేస్తున్న అయ్యన్న తనను విమర్శిస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. లిక్కర్ ఫ్యాక్టరీ, మద్యం విక్రయాలు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. టిడ్కో గృహాల్లో కాంట్రాక్టర్‌ను బెదిరించి రూ.10 కోట్లు దోచుకుని, అయ్యన్నపాత్రుడు ప్యాలెస్ నిర్మించుకున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు సర్వేలో రెండు రాష్ట్రాల్లో అయ్యన్నపాత్రుడు పెద్దకొడుకు మరుగుజ్జోడంత ఎదవ ఎవరూ లేరని తేలిందన్నారు. పొరపాటున అయ్యన్నపాత్రుడికి ఓటేస్తే నియోజకవర్గాన్ని అమ్మేస్తారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో 30 వేల ఓట్ల మెజార్టీతో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందన్నారు. పార్టీ మండల నాయకులు సుర్ల సత్యనారాయణ, మండల యూత్ నాయకులు దన్నిన నానాజీ, మాజీ జెడ్పీటీసీ అధికారి బలరామ్మూర్తి తదితర్లు ఉన్నారు.

విరాళాల కోసం వెళితే జనసేన కండువాలు వేశారు

- మేమంతా సీఎం జగన్ వెంటే..
- నాగులాపల్లి దళితుల స్పష్టీకరణ


ఎమ్మెల్యే రమణమూర్తిరాజుతో నాగులాపల్లి దళితులు

మునగపాక : 'మేమంతా దళితులం. సీఎం జగన్ వెంటే ఉంటాం. విరాళాల కోసం వెళితే జనసేన నేతలు కండువాలు వేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు విజయం కోసం శ్రమిస్తాం'.. అంటూ మండలంలోని నాగులాపల్లిలోని దళితులు తెలిపారు. నాగులాపల్లికి చెందిన పలువురు దళితులు ఇటీవల తమ గ్రామంలోని నూకాంబిక అమ్మవారి పండగ సందర్భంగా విరాళాలు అందించాలని కోరుతూ జనసేన నేత సుందరపు విజయకుమార్‌ను కలిశారు. దీంతో సాయం అడిగేందుకు వచ్చిన వారికి ఇష్టం లేకున్నా పార్టీ కండువాలు వేశారు. విషయం తెలుసుకున్న నాగులాపల్లి వైఎస్సార్‌సీపీ శ్రేణులు మంగళవారం సంబంధిత దళితులను ఎమ్మెల్యే రమణమూర్తిరాజు వద్దకు తీసుకువచ్చారు. దీంతో తామంతా మొదటి నుంచీ వైఎస్సార్‌సీపీకి విధేయులమని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రమణమూర్తిరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించి, మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసేందుకు కష్టపడి పనిచేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, వైస్ ఎంపీపీ చిందాడ దేవి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ మళ్ల ఉమామహేశ్వరరావు, పార్టీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు జామి రాజు తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి టీడీపీలో రచ్చ

- చల్లారని తెలుగు తమ్ముళ్ల వర్గపోరు
- యలమంచిలి సమావేశానికి దిన్‌బాబు డుమ్మా
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌తో కలిసి పనిచేయలేమన్న వైనం


సమావేశంలో అనుచరులతో మాట్లాడుతున్న దిన్‌బాబు

రాంబిల్లి: మండలంలో తెలుగు తమ్ముళ్ల వర్గ పోరు ఇంకా చల్లారలేదు. యలమంచిలిలో సోమవారం నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు వర్గీయులు మాజీ ఎంపీపీ పప్పల చలపతిరావును వేదికపైకి వెళ్లకుండా నెట్టేయడంతో పాటు రాంబిల్లి మండల అధ్యక్షుడు వసంతవాడ వెంకటేశ్వరరావు(దిన్‌బాబు)పై దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ రచ్చ మీడియాకెక్కడం, కూటమి పార్టీల నేతల రంగప్రవేశంతో మంగళవారం యలమంచిలిలో ప్రగడ నాయకత్వంలో సమావేశం నిర్వహించారు. దీనికి పప్పల హాజరయ్యారు. అయితే సోమవారం జరిగిన దాడితో తీవ్ర ఆవేదనకు గురైన దిన్‌బాబు వర్గం ఈ సమావేశానికి డుమ్మా కొట్టింది. అంతటితో ఆగక పంచదార్లలోని ఆయన స్వగృహం వద్ద అనుచరులతో మంగళవారం రాత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తనపై ప్రగడ వర్గీయులు కావాలనే కుర్చీలు విసిరి భౌతిక దాడికి పాల్పడినట్లు దిన్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరిగాక నాగేశ్వరరావుతో కలిసి పనిచేసేది లేదని తేల్చిచెప్పారు. దీంతో రాంబిల్లి మండలంలో తెలుగు తమ్ముళ్ల లొల్లి ఆసక్తిగా మారింది.

పప్పల తీరుపైనా అసంతృప్తి

సోమవారం నాటి ఘటనలో పప్పలను సైతం నెట్టేసినా, ఆయన మంగళవారం నాటి సమావేశానికి హాజరవడంపై తెలుగు తమ్ముళ్లు గుర్రుగా ఉన్నారు. దిన్‌బాబు అనుచరులు ఇదే అంశాన్ని చర్చించారు. అయితే అధిష్టానం సూచనల మేరకు ఆయా సమావేశానికి పప్పల వెళ్లారని అయితే అక్కడ ఆయన ఏమీ మాట్లాడలేదని దిన్‌బాబు చెప్పుకోవడం గమనార్హం.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

- మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో బూడి, కరణం


వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, చిత్రంలో ఎమ్మెల్యే ధర్మశ్రీ

చోడవరం: రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని ఉపముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అధ్యక్షతన మండల ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. గ్రామాల వారీగా కార్యకర్తలతో మాట్లాడి, పార్టీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఎటువంటి విభేదాల్లేకుండా కార్యకర్తలంతా గ్రామాల్లో సమష్టిగా పనిచేయాలని కోరారు. సీఎం జగన్ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజల కష్టాలు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి వద్దే అందుతున్న సేవలను ప్రజలకు వివరించాలన్నారు. ఎంపీగా తను, ఎమ్మెల్యేగా ధర్మశ్రీ ఇద్దరం కలిసి పార్టీ కార్యకర్తల అభివృద్ధికి, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మంత్రిగా మాడుగుల అభివృద్ధికి ఎంతో కృషిచేశానని, ఎంపీగా అన్ని నియోజకవర్గాల అభివృద్ధికి పూర్తి స్థాయిలో పనిచేస్తానన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మశ్రీ మాట్లాడుతూ గ్రామాల వారీగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహసారథులు, పార్టీ నాయకులు అంతా కలిసి వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గెలిచేలా కృషిచేయాలన్నారు. ప్రతిపక్షాల ప్రలోభాలను ఎక్కడికక్కడ గుర్తించి కట్టడి చేయాలన్నారు. వలంటీర్లు విధులు నిర్వహించకుండా టీడీపీ నాయకులు అడ్డుపడిన విధానాన్ని ప్రజలకు వివరించాలన్నారు. వృద్ధులు, పింఛన్‌దారులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేశారన్న విషయాన్ని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని కార్యకర్తలను కోరారు. ఈ సమావేశంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు బొడ్డేడ కాశీవిశ్వనాథ్, రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు బండారు సత్యనారాయణ, జెడ్పీటీసీ మారిశెట్టి విజయశ్రీకాంత్, ఎంపీపీ గాడికాసు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నిబద్ధతతో ఎన్నికల విధులు నిర్వర్తించాలి

- మాస్టర్ ట్రైనీల శిక్షణలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి


మాస్టర్ ట్రైనీల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అధికారులు, సిబ్బంది ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ఆత్మస్థైర్యం, నిబద్ధతతో పోలింగ్ నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనీల శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంకు, భయం లేకుండా ధైర్యంగా, సజావుగా పోలింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. ముఖ్యంగా ప్రిసైడింగ్ అధికారులకు విధులపై శతశాతం నమ్మకం, నిబద్ధత కలిగించాలన్నారు. చెక్ లిస్ట్ తీసుకోవడం, తిరిగి అప్పగించడం, మాక్ ఓటింగ్‌తో పాటు పోలింగ్ ప్రారంభానికి ముందు, ముగిసిన తరువాత ఏమేం చేయాలో క్షుణ్ణంగా అవగాహన కలిగించాలన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం తనిఖీ చేసి చూపించడం, పోలింగ్ ఏజెంట్ల బాధ్యతలు తెలియజేయడం పక్కాగా జరిగేలా తర్ఫీదునివ్వాలన్నారు. తరచుగా చోటుచేసుకునే తప్పులు జరగకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. పోలింగ్ ప్రారంభమయ్యాక ఎక్కువ మంది ఉంటే ఏ విధంగా నియంత్రించవచ్చు, దివ్యాంగులు, ప్రధానంగా అంధుల ఓటింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూలంకషంగా చెప్పాలన్నారు. వివిధ రకాల ఓట్లను ఏ విధంగా నిర్వహించాలో విపులంగా వివరించాలన్నారు. అనంతరం అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి ఏజే చిన్నికృష్ణ అసెంబ్లీ స్థాయిలో పోలింగ్ శిక్షణ విధివిధానాలపై మాస్టర్ ట్రైనీలకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి 52 మంది మాస్టర్ ట్రైనీలు హాజరయ్యారు. కార్యక్రమంలో పౌర సరఫరాల డీఎం జయంతి, డీఎల్‌డీవో నాగమణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు డి.రామ్మూర్తి పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


అప్పారావు మృతదేహాన్ని బోటుపై తీసుకు వస్తున్న జాలర్లు

గొలుగొండ: తాండవ జలాశయం వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన బోటు ప్రమాదంలో గల్లంతైన గరగల అప్పారావు మృతదేహం మంగళవారం జలాశయంలో తేలింది. ఆదివారం అర్ధరాత్రి రొయ్యల వేటకు వెళ్లిన అప్పారావు బోటు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. సోమవారం నుంచి మంగళవారం సాయంత్రం వరకు జాలర్లు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అప్పారావు కోసం గాలించారు. అయితే మంగళవారం సాయంత్రానికి ప్రమాదం జరిగిన చోటే అప్పారావు మృతదేహంగా కనిపించడంతో జాలర్లు, పోలీసులు మృతదేహాన్ని ఒడ్డుకు తెచ్చి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. అప్పారావు మృతదేహానికి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి సిబ్బంది జలాశయం ఒడ్డునే పోస్టుమార్టం నిర్వహించారు. అప్పారావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు, వృద్ధులైన తల్లిదండ్రులు ఉన్నారు. మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గాలింపు చర్యల్లో ఎస్‌ఐ బి.కృష్ణారావు, జాలర్లు పాల్గొన్నారు.

సారా తయారీ సామగ్రి ధ్వంసం


పులుపు, సారా తయారీ సామాగ్రిని ధ్వంసం చేస్తున్న కొత్తకోట పోలీసులు

రావికమతం: దొండపూడి గ్రామ శివార్లలో సారా తయారీకి సిద్ధంగా ఉన్న 2 వేల లీటర్ల పులుపును ధ్వంసం చేసినట్లు కొత్తకోట సీఐ అప్పలనాయుడు మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు. దొండపూడి గ్రామంలో సారా విక్రయాలు జరుగుతున్నట్టు అందిన ముందస్తు సమాచారంతో సిబ్బందితో కలిసి ఎస్‌ఐ లక్ష్మణరావు దాడులు చేశారు. గ్రామ శివారు కొండపై పులుపు, పెద్ద ఎత్తున సారా తయారీ పరికరాలను గుర్తించి, ధ్వంసం చేశారు. దీంతోపాటు 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సారా ప్యాకెట్లతో ఒకరి అరెస్టు


పట్టుబడిన సారా ప్యాకెట్లు

చోడవరం రూరల్: సారా ప్యాకెట్లను విక్రయాల కోసం తరలిస్తున్న చోడవరానికి చెందిన బంగారి దుర్గాప్రసాద్ (38)ను అరెస్టు చేసినట్లు సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఎస్‌ఐ డి.శేఖరం తన సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా, పట్టణంలోని చీడికాడ రోడ్డులో ఐటీఐ కాలనీ సమీపంలో నిందితుడు దుర్గాప్రసాద్ వద్ద 28 సారా ప్యాకెట్లు లభ్యమయ్యాయన్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించారన్నారు.

65 గోవులను తరలిస్తున్న కంటెయినర్ సీజ్


నక్కపల్లి: పోలీసులు పట్టుకున్న కంటెయినర్ లారీ


యలమంచిలి రూరల్: పోలీసులు అదుపులో నిందితులు, కంటెయినర్ వాహనం

నక్కపల్లి: జాతీయ రహదారిపై వేంపాడు టోల్ ప్లాజా వద్ద అక్రమంగా గోవులను తరలిస్తున్న కంటెయినర్‌ను నక్కపల్లి పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు కంటెయినర్‌లో గోవులు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు నర్సీపట్నం డీఎస్పీ మోహన్, సీఐ విజయ్‌కుమార్‌లు టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించారు. కంటెయినర్‌లారీలో 65 గోవులను తరలిస్తున్నట్లు గుర్తించి సీజ్ చేశారు. గోవులను గోపాలపట్నం గోశాలకు సురక్షితంగా తరలించే ఏర్పాట్లు చేసినట్లు సీఐ తెలిపారు.


యలమంచిలి రూరల్: కంటెయినర్‌లో గోవులు

43 గోవులతో పట్టివేత

యలమంచిలి రూరల్: మండలంలోని రేగుపాలెం హైవే జంక్షన్‌లో 43 గోవులను అక్రమంగా తరలిస్తున్న కంటెయినర్ లారీని మంగళవారం ఎస్‌ఐ సింహాచలం పట్టుకున్నారు. కంటెయినర్‌లో కాలు కదపలేనంతగా గోవులను కుక్కి, తాళ్లతో బంధించడాన్ని చూసి ఆయన ఆశ్చర్యపోయారు. వెంటనే కంటెయినర్ లారీని సీజ్ చేసి, 43 గోవులను విశాఖలోని జ్ఞానానంద గోశాలకు తరలించామన్నారు. గోవుల అక్రమ రవాణాకు సంబంధించి ఇద్దరిని అరెస్ట్ చేశామన్నారు.

క్లుప్తంగా

సీతారామ కల్యాణ పోస్టర్ ఆవిష్కరణ



సీతారామ కల్యాణమహోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్ శ్రీసీతారామాలయంలో సీతారామ కల్యాణ మహోత్సవ గోడపత్రికను ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 15న సీతారామస్వామి పెళ్లిరాట మహోత్సవం, 17న కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత గౌరవాధ్యక్షులు కొణతాల జగన్నాథరావు నాయుడు, కొణతాల నారాయణరావు, కార్యదర్శి సిరసపల్లి సూరిబాబు, కోశాధికారి దాసిరెడ్డి వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కామధేనువు ప్రసాద్, కార్యదర్శి సిరసపల్లి రాజు, కోశాధికారి విన్నకోట నీలేష్ గుప్తా, కన్వీనర్ పచ్చర్ల వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆటిజం పిల్లల పట్ల మరింత శ్రద్ధ అవసరం

అనకాపల్లి: ప్రతి 100 మంది పిల్లల్లో ఒకరు ఆటిజంతో జన్మిస్తున్నారని, బాలికలతో పోల్చుకుంటే బాలురులో నాలుగు రెట్లు అధికమని ఎంఈవో-2 కోటేశ్వరరావు తెలిపారు. జీవీఎంసీ విలీన గ్రామం కొండకొప్పాక భవిత కేంద్రంలోను, జిల్లా పరిషత్ హైస్కూల్లోను మంగళవారం ప్రపంచ ఆటిజం దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సుమారు 70 కోట్ల మంది ఆటిజంతో బాధపడుతున్నారన్నారు. ఇందుకు జన్యుపరమైన కారణాలతోపాటు, సామాజిక పర్యావరణ పరిస్థితులు కూడా కారణమన్నారు. గర్భస్థ దశలో తల్లి తీవ్ర ఒత్తిడికి గురవడం, అతిగా మాదక ద్రవ్యాలు సేవించడం, నెలలు నిండకుండానే జన్మించడం తదితర అంశాలు కూడా పిల్లల్లో ఆటిజానికి కారణమన్నారు. పోషకాహార లోపం, ఉద్యోగం, మానసిక భద్రత లోపించి ఒంటరిగా పెరగడం కూడా ఆటిజానికి కారణమవుతోందన్నారు. తల్లిదండ్రులు మానసిక స్థైర్యాన్ని కోల్పోకుండా వారికి అండగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం సుమమణి, భవిత కేంద్రం ఉపాధ్యాయులు ఎస్.ఏసురత్నం, సీహెచ్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ (తెలుగు 3డి)	: సత్యనారాయణస్క్రీన్-1
టిల్లు స్క్వేర్	: సత్యనారాయణస్క్రీన్-2
ఓం భీం బుష్	: షిర్డిసాయి
గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ (తెలుగు 3డి)	: పర్తిసాయి
ది గోట్ లైఫ్	: వెంకటేశ్వర
హనుమాన్	: శ్రీసత్య
టిల్లు స్క్వేర్	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 5,988 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,700	4,440
మొదటి రకం	3,520	4,130
రెండో రకం	3,430	3,770
మూడోరకం	3,250	3,470

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 23 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-6 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 418 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 343 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



సేవలు తొలగి.. వేదన మిగిలి

- పింఛన్లు అందక వృద్ధులు, వికలాంగులు, వితంతువుల గగ్గోలు
- చంద్రబాబు అధికారంలోకి వస్తే మళ్లీ పాతరోజులేనని ఆందోళన
- సేవలందిస్తున్న వలంటీర్లపై కుట్రాలా? అంటూ ఆగ్రహం

అయ్యా..
వయసుమీదికొచ్చిన ముసిల్దాన్ని. ఏదో కష్టంగా నడుద్దామన్నా కాళ్లు వసులాడని పరిస్థితి. దీనికి తోడు పీడిస్తున్న రోగం. ఇంట్లో వెచ్చాలైపోనాయి. పింఛనీలిచ్చే వలంటీరు బాబింకా రాలేదు. దయచేసి ఆ బాబును పంపించి, నా పింఛనీ డబ్బులు ఇప్పించండయ్యా.. అంటూ దారెంట వెళ్లే వారిని ప్రాధేయపడుతుందో వృద్ధురాలు.

నాయనా..
నాకా.. సరిగా సూపానదు. వయసుడిగి ఏ పన్చేసే ఓపిక నేక ఇంటిపట్టునే ఉంతన్నా. సచివాలయం అక్కడెక్కడో ఆమడ దూరానుంది. మంచంపై పదుకోవాలన్నా ఇంకొకలి సాయం కావాల. అలాటిది నానెలాగెళ్లగల్ను. పెద్ద మనసు చేసుకుని మీరే నా పింఛనీ డబ్బులు ఇప్పించాలయ్యా.. అంటూ ఇంకో అభాగ్యురాలి ఆవేదన.

అనకాపల్లి/తుమ్మపాల/కశింకోట: గ్రామ/వార్డు వలంటీర్లపై విపక్షాల కుట్రలతో పింఛన్ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే ఇంటి ముంగిట కొచ్చి పింఛన్లు అందించే వలంటీర్లను ఆ విధుల నుంచి తప్పించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబుకు, ఆయన తొత్తులకు అధికార యావ తప్ప పేదలు, అభాగ్యుల బతుకులు పట్టవని ఆక్షేపిస్తున్నారు. చంద్రబాబు అధికారంలో లేకుండానే ఇన్ని అకృత్యాలు చేయగలిగితే.. రేపు అధికారం వస్తే మేం బతకగలమా? అంటూ భయపడుతున్నారు.

రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై తాము వేసే ఓటుతో విపక్ష కూటమిని కూకటి వేళ్లతో సహా పెకిలిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నారు.

నియోజకవర్గంలో పింఛన్లు

నియోజకవర్గంలో పింఛన్ లబ్ధి వివరాలు

మండలం	లబ్ధిదారులు	మొత్తం లబ్ధి రూ. కోట్లలో
అనకాపల్లి	13,055	3.79
అనకాపల్లి టౌన్	10,100	3.00
కశింకోట	10,537	3.06

పింఛన్ డబ్బులే జీవనాధారం



నా భర్త చనిపోయారు. పిల్ల లు ఎవరి మానాన వారు బతుకుతున్నారు. సేనా కాలంగా పింఛన్ ఇస్తన్నా రు. పెతీ నెలా ఒకటో తారీకునే వలంటీర్ మా ఇంటికే వచ్చి పింఛన్ డబ్బులు నెక్కతప్పకుండా సేతికిచ్చేవోరు. ఆ డబ్బులే నా బతుకుతెరువు. ఈ నెల పింఛన్ సొమ్ము ఇంకా ఇవ్వలేదు. ఎప్పుడిస్తారో కూడా తెలీదంటున్నారు. సచివాలయానికెళ్తే రేపు రమ్మన్నారు. మళ్లీ పాత బతుకుల్లోకి నెట్టేత్తన్నారు. గత పెబుత్వంలో పింఛన్ కోసం పడిన తిప్పలు ఇంకా కళ్లెదర కదలాడతానే ఉన్నాయి. పింఛన్ రాకపోతే అప్పోసప్పో సేసుకుని బతకాల.

-గుడబండి అప్పలనరస, బయ్యవరం, కశింకోట

పింఛను కోసం నన్నెవరు తీసుకెళ్తారు?



నాకు రెండు కాళ్లు సాగవు. నడవలేని పరిస్థితి. దీనికి తోడు అనారోగ్యం. దీంతో ఇంటికే పరిమితమయ్యాను. ప్రతి నెలా వలంటీర్లే ఇంటికొచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చేవారు. రెండో తేదీ వచ్చినా పింఛన్ డబ్బులు ఇంకా ఇవ్వలేదు. వలంటీర్ కోసం కబురు పెడితే ఎలక్షన్లున్నాయి, వలంటీర్లు పింఛన్లు ఇవ్వకూడదని అధికారులు చెప్పారట. ఇపుడు ఎవరిస్తారు. పింఛన్ లేకపోతే నా పరిస్థితేంటి? సచివాలయానికి వెళ్లాలంటే.. నన్నెవరు తీసుకెళ్తారు? నేనెలా బ్రతకాలి?

– ఇసరపు అప్పలనర్సమ్మ, గొలగాం కాలనీ

సచివాలయానికి నేనెళ్లలేనయ్యా



నాకు రెండు కళ్లు కనిపించవు. ఏ పనీ చేసే ఓపిక లేక ఇంటి వద్దే ఉంటున్నా. వలంటీర్ నాకు ప్రతి నెల ఒకటో తేదీన ఇంటికే వచ్చి పింఛన్ ఇచ్చేవాడు. రెండు రోజులయింది. ఇంకా పింఛను అందలేదు. సచివాలయంలో ఇస్తారని వలంటీర్ చెప్పాడు. అక్కడకు వెళ్లాలంటే కిలోమీటరుపైనే నడవాలి. ఎవరి సాయం లేకుండా మంచం మీదకే వెళ్లలేను. అలాంటిది సచివాలయానికి వెళ్లగలనా? వెళ్తే ఎవరిస్తారో, ఎప్పుడిస్తారో కూడా తెలీదు. చంద్రబాబు ఉన్నపుడు ఇలాగే ఇబ్బందులు పెట్టేవారు.

– పల్లా వరహాలమ్మ, గొలగాం కాలనీ

పెన్షన్ రాకపోతే సావే దిక్కు



నా భర్త అనారోగ్యంతో మరణించారు. జగన్‌బాబు ఇస్తున్న పింఛన్ డబ్బులతో ఒంటరిగా బతుకుతున్నా. ప్రతి నెలా వలంటీర్ వచ్చి పింఛను డబ్బులు నా చేతికిచ్చేవాడు. ఆ డబ్బుల్ని దేవుడి దగ్గర పెట్టి రాజశేఖర్‌రెడ్డి బిడ్డ జగన్‌ను తలచుకుని నా అవసరాలకు వాడుకుంటున్నాను. ఈ నెల పింఛను ఇంకా రాలేదు. రెండు సార్లు సచివాలయానికి వెళ్లా. పింఛన్ ఇవ్వలేదు. వలంటీర్‌ను మా ఇళ్లకు తిరగొద్దన్నారట. రాత్రంతా నిద్ర పట్టలేదు. పెన్షన్ రాకపోతే నాకు సావే దిక్కు.

– పచ్చికూర కాసులమ్మ, రేబాక

పేదల బతుకులపై కుట్రలా?



నాకున్న పూరిపాకలో ఒంటరిగా బతుకుతున్నా. ఊతకర్ర సాయం లేనిదే ఇంటిలో నుంచి బయటకు వెళ్లి రాలేను. నాకు ఏ కష్టమొచ్చినా మా వలంటీరే వచ్చి సాయం చేస్తుంది. జగనిచ్చే పింఛన్ డబ్బులు నెలంతా సరిపోతున్నాయి. ప్రతి నెలా వలంటీర్ ఇంటికొచ్చి జీతంలా నాకు డబ్బులు ఇస్తుంది. ఏమైనా పనులుంటే చేసిపెడుతుంది. అలాంటిది ఈ నెల వలంటీర్‌ను నా ఇంటికి రాకుండా చేసింది సెంద్రబాబే. పింఛన్‌తో బ్రతికే మాపై కుట్రలు చేయడం సెంద్రబాబుకు న్యాయమా?

– ఉగ్గిన సింహాచలం, కుంచంగి గ్రామం

హైవేపై వాహన తనిఖీలు ముమ్మరం



బాటజంగాలపాలెం చెక్ పోస్టు వద్ద సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ రమణ

సబ్బవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జాతీయ రహదారిపై పలు చెక్ పోస్టుల వద్ద పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. మండలంలోని అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై బాటజంగాలపాలెంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద మంగళవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. సీఐ పిన్నింటి రమణ, సిబ్బందితో కలిసి జాతీయ రహదారిపై వెళ్తున్న పలు వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నగదు, మద్యం తరలింపుపై దృష్టి పెట్టినట్టు సీఐ తెలిపారు.

ఘనంగా పరదేశమ్మ తల్లి పండగ



పరదేశమ్మతల్లిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ దంపతులు

మునగపాక : మండల కేంద్రంలో మంగళవారం పరదేశమ్మ తల్లి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. కాగా పండగను సర్పంచ్ దిమ్మల అప్పారావు తెల్లవారు ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. భక్తులకు ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు గాను మజ్జిగ పంపిణీ చేపట్టారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్,ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్ అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా అమ్మవార్ల పండగలు

పరవాడ : పరవాడ, నాయుడుపాలెం, దేశపాత్రునిపాలెం, తానాం గ్రామాల్లో కొలువుదీరిన పైడిమాంబ, ముత్యాలమ్మతల్లి, పోలమాంబ, పరదేశిమాంబ అమ్మవార్ల మారువారం పండగను ఆయా గ్రామాల ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. పరవాడ గ్రామంలో కొలువుదీరిన పైడిమాంబ అమ్మవారిని ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి, శ్రీనివాసరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన ప్రారంభించారు. అమ్మవారిని పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మహిళ కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ, ఉప సర్పంచ్ బండారు రామారావు, నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, చల్లా కనకారావు, వర్రి హరి, సీహెచ్.సన్యాసిరావు దర్శించుకున్నారు.

- నాయుడుపాలెం, వాడచీపురుపల్లి గ్రామాల ఆరాధ్య దైవం ముత్యమాంబ అమ్మవారి మారువారం పండగను మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అలాగే తానాం పరదేశిమాంబ అమ్మవారి మారువారం పండగ, దేశపాత్రునిపాలెం పోలమాంబ మారువారం పండగ ఘనంగా జరుపుకున్నారు.

11 మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి: స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా 11 మద్యం బాటిళ్ల అక్రమ రవాణాను గుర్తించినట్లు పట్టణ సీఐ శంకరరావు తెలిపారు. మంగళవారం యథావిధిగా నిర్వహించిన తనిఖీల్లో పట్టణానికి చెందిన జయసంతోష్ నుంచి వీటిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రచారంలో దూసుకెళ్తున్న వైఎస్సార్‌సీపీ



81వ వార్డు ఎన్నికల ప్రచారంలో మలసాల భరత్‌కుమార్



అల్లిఖానుడువానిపాలెంలో ప్రచారం చేస్తున్న మలసాల





రొంగలివానిపాలెంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న మలసాల భరత్‌కుమార్

- వారి హామీలను నమ్మి మోసపోవద్దు
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓటర్లను ప్రలోభ పెట్టేలా కూటమి నేతలు బూటకపు హామీలు గుప్పిస్తారని, దానిని నమ్మితే ఐదేళ్లపాటు నష్టపోక తప్పదని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. మండలంలోని అల్లిఖానుడుపాలెం, రొంగలివానిపాలెం, 81వ వార్డులో మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ప్రకటించిన మ్యానిఫెస్టోను 99 శాతం అమలు చేసి, తన చిత్తశుద్ధిని, విశ్వసనీయతను నిరూపించుకున్నారని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకుని, సంక్షేమంతోపాటు, అభివృద్ధికి సాయపడాల్సిందిగా అభ్యర్థించారు. ఓటమి భయంతో విపక్షాలు కూటమిగా ప్రజల మీదికి దండెత్తి వస్తున్నాయని, వారి బూటకు హామీలను నమ్మి మోసపోవద్దని కోరారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు తన పాలనలో ప్రజలకు చేసిన ఒక్క మంచి కార్యక్రమం గురించి కూడా చెప్పలేని పరిస్థితిలో ఉన్నారంటే.. ఆయన పాలన ఎవరి ప్రయోజనాల కోసమో తెలుసుకోవాలని సూచించారు. కూటమికి గట్టిగా బుద్ధి చెప్పే రోజులు సమీపించాయన్నారు. అంతకుముందు మండలంలోని ఊడేరు గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ సతీమణి నివేదిత గడపగడపకు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య రాంబాబు, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొడ్డేడ శివ, ఆయా ప్రాంతాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న దిలీప్‌కుమార్

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల్ని గెలిపించి, జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకునే బాధ్యత తమ అందరిపైనా ఉందని ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. మండలంలోని మారేడుపూడి, గోపాలపురం గ్రామాల్లో ఉపాధి కూలీలతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 సార్వత్రిక ఎన్నికల్లో బూటకపు హామీలతో చంద్రబాబు గద్దెనెక్కి, ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. మళ్లీ అంతకు మించిన హామీలతో 2024 ఎన్నికలకు సిద్ధమవుతున్నారని, అప్రమత్తంగా ఉండాలని కోరారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, బీజేపీ కూటమి అధికార దాహంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విషం కక్కుతోందన్నారు. 2019 ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను సీఎం జగన్ 99 శాతం అమలు చేశారని తెలిపారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ సతీమణి నివేదిత, పార్టీ నాయకులు గంగుపాం నాగేశ్వరరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి



అర్తమూరి విజయ్‌కుమార్‌ను అభినందిస్తున్న క్రిస్టియన్ పాస్టర్ ఫెలోషిప్ సంఘం సభ్యులు

యలమంచిలి : మండలంలో క్రిస్టియన్ మైనారిటీ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని యలమంచిలి మండలం వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు అర్తమూరి విజయ్‌కుమార్ అన్నారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల కమిటీల్లో భాగంగా యలమంచిలి మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన అర్తమూరి విజయ్‌కుమార్‌ను యలమంచిలి మండలం పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు సోమవారం యలమంచిలి మున్సిపాలిటీ పెదపల్లి చర్చిలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అభివృద్ధి పథకాలు అందించడానికి శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ తరపున చేసిన సేవలు గుర్తించి తనకు అప్పచెప్పిన బాధ్యతను తూచా తప్పక పాటిస్తానని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి క్రిస్టియన్ మైనారిటీ వర్గాల మద్దతు తెలిపేలా తోడ్పడతానని అన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి యూపీఎఫ్ అధ్యక్షులు వినోద అబ్రహాం, వైఎంపీఎఫ్ అధ్యక్షులు బిషప్, డాక్టర్, కె.బి.కె.పీటర్, సెక్రటరీ సిహెచ్ ,జాషువారాయ్, కె.కృపారావు, జీవశేఖర్, చార్లెస్ పిన్ని, బి.జేమ్స్ పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో దీనరాజుకు గోల్డ్ మెడల్



విద్యార్థిని సత్కరిస్తున్న హెచ్‌ఎం శ్రీధర్

అనకాపల్లి: రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మండలంలోని మామిడిపాలెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి వి.దీనరాజు గోల్డ్‌మెడల్ సాధించాడు. ఎన్టీఆర్ జిల్లాలో నిర్వహించిన 67వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో 17 ఏళ్ల బాలుర విభాగంలో 93 కిలోల బరువు ఎత్తి దీనరాజు గోల్డ్ మెడల్ సాధించినట్లు హెచ్‌ఎం బి.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం దీనరాజును హైస్కూల్ ఆవరణలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసి, వారు ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొంది చినబ్బాయ్, పట్టాభి, స్వామి, కరుణజ్యోతి, విజయలక్ష్మి, ప్రసాద్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మునగపాకలో ఉపాధిహామీ పథకం పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో మన్మథరావు

మునగపాక : ఉపాధి హామీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎం.మన్మథరావు కోరారు. మునగపాక మెయిన్‌రోడ్డు పరిధిలో జరుగుతున్న ఉపాధిహామీ పథకం పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలస కూలీలను నివారించేందుకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు అందజేస్తామన్నారు. చేసిన పనికి సకాలంలో వేతనం అందుతుందన్నారు. అలాగే ఈ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ దొడ్డి గోవింద ఉన్నారు.

అభయాంజనేయ ఆలయానికి విరాళం



అభయాంజనేయస్వామికి వెండి కిరీటం నిమిత్తం రూ.10వేలు అందజేస్తున్న భక్తురాలు భవాని

మునగపాక: మునగపాకలోని సంతబయిల అభయాంజనేయ స్వామివారికి వెండి కిరీటం తొడుగు తయారీకి సంబంధించి అనకాపల్లి భవాని మంగళవారం రూ.10వేల మేర విరాళం అందజేశారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా దాతలు ముందుకొచ్చి సహకరించాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.